పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- తిరుపతి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పారవోలులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని సంక్షేమ బుక్‌లెట్లతో తెలియజేశారు. సమస్యలపై ఆరా తీశారు. అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందనివారు తమ దృష్టికి తీసుకురావాలని అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలను 99శాతం సీఎం నెరవేర్చుతున్నారని, ప్రజలక వద్దకే పాలన సాగిస్తున్న ఆయన్ను మరోమారు ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పి. శ్రీదేవి సదానందరెడ్డి దంపతులు, తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, నేతలు మాధవరెడ్డి, సర్పంచ్ వెల్లూరు అమ్ములు, బుచ్చిబాబు ,వైస్ సర్పంచ్ రత్నం, తమ్మిరెడ్డి భయ్యారెడ్డి, పెట్లూరు కోటేశ్వరరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ వెంకటేశ్వర్లు, చింతగుంట సర్పంచ్ కె.చెంచుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయరూ!

వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్లనిర్మాణం వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అధికారులను కోరారు. వెంకటగిరిలో స్థానికంగా ఆయన నివాసంలో తహసీల్దార్ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ బీవీ.రామయ్య, వార్డు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణం త్వరతగతిన పూర్తి చేయించాలని సూచించారు.

ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోరూ!

- పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్‌కు ఎమ్మెల్యే వరప్రసాద్ వినతి



మంత్రి అమర్నాథ్‌కు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: గూడూరు సమీపంలో ఏర్పాటు కానున్న ఆటోనగర్‌కు అనుసంధానంగా ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయాలని, తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా వస్తాయని పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్‌ను ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కోరారు. విశాఖపట్నంలో మంత్రిని శనివారం ఎమ్మెల్యే కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆటోనగర్ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ఆ ఆటోనగర్‌కు సంబంధించి మొదట చర్యలు తీసుకున్న దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డిని సేవలను కూడా స్మరించారు. ఆటోనగర్‌కు అవసరమైన మౌలిక వసతులు కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఏపీఐఐసీ జాతీయ రహదారి నుంచి ఆటోనగర్‌కు రోడ్డు ఏర్పాటు చేస్తే పట్టణంలోకి వెళ్లకుండా నేరుగా జాతీయ రహదారిని అటు చెన్నై వైపుగానీ, నెల్లూరు వైపుగానీ వెళ్లేందుకు అనువుగా ఉంటుందని మంత్రికి నివేదించారు. మంత్రి తన వినతిపై సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

లక్ష్మీనరసింహునికి పల్లకీ సేవ



ప్రత్యేక అలంకరణలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి

చిల్లకూరు: మండలంలో కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి అమ్మవార్లకు శనివారం సాయంత్రం పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. తొలుత ఉదయం చెంచులక్ష్మీ, ఆదిలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామికి పలు అభిషేకాల అనంతరం ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆవరణలోని మండపంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. మధ్యాహ్నం తిక్కవరం గ్రామస్తులు కందలూరు గంగాధర్‌రెడ్డి, అనిత ఉభయకర్తలుగా వ్యవహరించి భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ కందల ఆనంద్ పర్యవేక్షించారు.

భక్తిప్రపత్తులతో ఉత్సవాలు

చిట్టమూరు:ఎల్లూరులోని రాజమునీశ్వరస్వామి నాగార్పమ్మల వార్షికోత్సవం శనివారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. గణపతి పూజ, వివిధ హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూల విరాట్‌కు అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

శ్రీవారికి వెండి పాత్ర సమర్పణ



జనార్దన్‌రెడ్డికి వెండి పాత్రను ఇస్తున్న త్రినాథ్

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి శనివారం దేవస్థాన వేద పండితుడు త్రినాథ్ కల్యాణ్ దంపతులు 450 గ్రాముల వెండి పంచామృత పాత్రను సమర్పించినట్లు ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. దీని విలువ 40 వేల రూపాయల వరకూ ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, ప్రసాద్ స్వామి, మల్లికార్జునస్వామి, నాగరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.

మరోమారు వైఎస్సార్‌సీపీని ఆదరించండి



కానూరులో లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

పెళ్లకూరు: రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనను కొనసాగించుకోవడానికి మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం కానూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం మంచి పాలన అందిస్తూ ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి, అందరికీ మంచి చేశామని, అందుకే వచ్చే ఎన్నికల్లో మరోమారు దీవించాలని ప్రజలను అభ్యర్థించారు. టీడీపీ, జనసేన చెప్పే అబద్ధాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఎంపీపీ శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్, సచివాలయ కన్వీనర్ రఘునాయుడు, నాయకులు చైతన్యకృష్ణారెడ్డి, బాలసుబ్రమణ్యం, వెంకమరాజు, చక్రపాణి, చెంచురామయ్య, అశోక్, చలపతి, వీరకుమార్, చందు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేడుకగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వర దేవి ఆలయంలో ధ్వజస్తంభ, దక్షణామూర్తి నవగ్రహ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాలను మూడు రోజులు పాటు వైభవంగా నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవారి శాంతి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేశారు. వేద పండితులు మహా మంగళ హారతి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

లాటరీ పద్ధతిలో 'గురుకులం' అడ్మిషన్లు

కోట: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో లాటరీ విధానంలో అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ రమేష్‌బాబు శనివారం తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి 3 నుంచి 9 వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.3లో40, 4లో36, 5లో32, 6లో24, 7లో5, 8లో1, 9వ తరగతిలో 8 సీట్లు ఖాళీలు ఉన్నట్లు వివరించారు. ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి: స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు)లో 3వ తరగతి ప్రవేశంతోపాటు 4 నుంచి 9వ తరగతి వరకూ బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు చేసుకోవాలని, లాటరీ విధానంలో సీట్లు భర్తీ చేస్తామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 31 సీట్లు (ఎస్టీ), ఎస్సీ కేటగిరికి 5, బీసీకి 2, ఓసీ 1 సీటు చొప్పున ప్రభుత్వం కేటాయించిందని, ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

271 మద్యం బాటిళ్లు ధ్వంసం

గూడూరు: గూడూరు ఎస్ఈబీ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 271 మద్యం బాటిళ్లను శనివారం స్థానిక ఎస్ఈబీ కార్యాలయ ఆవరణలో ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సూపరిండెంట్ పీ. విజయ్‌కుమార్ తెలిపారు. వీటి విలువ రూ 35,230 ఉంటుందని ఆయన తెలిపారు. బాటిళ్లలోని మద్యాన్నిపారబోసి, ఖాళీ మద్యం బాటిళ్లు, సంచులను కూడా తగులబెట్టినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ శేషమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన

గూడూరు: పట్టణంలోని కరణాల వీధి నుంచి బాలాజీ నగర్ ప్రాంతానికి వెళ్లే ప్రజల సౌకర్యార్థం పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా కల్వర్టు నిర్మిస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పానకా దేవసేనమ్మ తెలిపారు. శనివారం కల్వర్టు నిర్మాణ పనులను మున్సిపల్ కమిషనర్ సాయినాథ్‌తో కలసి ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 11వ సచివాలయం పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు వర్షాకాలం ఈ మార్గం మీదుగా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడేవారని, వారి విజ్ఞప్తి మేరకు ఈ కల్వర్టును నిర్మిస్తున్నట్లు ఆమె చెప్పారు.

నేడు లక్ష తమలపాకులతో అర్చన

సూళ్లూరుపేట: పట్టణంలో వెలసిన శ్రీ బాలాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి లక్ష తమలపాకులతో అర్చన, పూజలు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ అయితా శ్రీధర్, ఆలయ ప్రధాన అర్చకులు దివి లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. ఆదివారం నుంచి ఆలయంలో శ్రీ హనుమ జయంతోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 18 వరకు జరుగుతాయన్నారు. స్వామివారికి రామాజంనేయ స్వామి అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామన్నారు.

బీసీ కండ్రిగలో ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వెంకటగిరి రూరల్: మండలంలో సోమసానిగుంట పంచాయతీలోని ధర్మచాట్లవారి కండ్రిగ ఎస్టీ కాలనీలో బంగారుపేట సీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నాచురోపతి వైద్యులు రాము, రుయా వైద్యశాల వైద్యులు రవి, గూడూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ హనుమంతరావు రోగులను పరీక్షించారు.

17న జాబ్‌మేళా

గూడూరు: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 17న నిర్వహించే మినీ జాబ్ మేళాను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరాములు, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్ శ్యాంమోహన్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. 5వ తరగతి, 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, ఇంజినీరింగ్ పాసైన యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఈ మేళాలో తిరుపతిలోని ప్రముఖ టీసీఎల్ కంపెనీ, నాయుడుపేటలోని గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, అలాగే శ్రీసిటీలోని ప్రముఖ కంపెనీ భారత్ ఎఫ్ఐహెచ్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలున్నాయన్నారు. యువతీ యువకులు ఆధార్ కార్డ్ జెరాక్స్‌తోపాటు బయోడేటాతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 7799300659 నంబరును సంప్రదించవచ్చని వారు తెలిపారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన



కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధి ఏపీఓ గిరిబాబు

చిల్లకూరు: మండలంలో సన్న చిన్న కారు రైతులు ఉద్యాన పంటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి ఏపీఓ గిరిబాబు కోరారు. బూదనంలో ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించిన అనంతరం కూలీలకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించారు. సన్న చిన్న కారు రైతులు రెవెన్యూ అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రాలను తీసుకువస్తే వారికి జామ, సపోట, మునగ, మామిడి, నిమ్మ మొక్కలను సరఫరా చేస్తామన్నారు.

అంగన్‌వాడీ ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు రూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ గూడూరు అర్బన్, రూరల్ ప్రాజెక్ట్‌ల పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు,హెల్పర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అర్బన్ సీడీపీఓ ఎస్‌కె.మెహబూబి శనివారం ఒక ప్రకటనలో కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు సంబంధించి కామాక్షినగర్, కోర్టుసెంటర్(బీసీ-బి, హెల్పర్ పోస్టులకు సంబంధించి చిల్లకూరు మండలం ఉడతావారిపాళ్లపల్లె(ఓసీ), గూడూరు మండలం సంతదాసుపల్లి(ఎస్సీ), తిప్పవరప్పాడు(బీసీ-బీ), గూడూరులోని గుంటకట్టకాలువ(ఎస్సీ) రాణిపేట-1 (బీసీ-బీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం లోపు తమ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని కోరారు. దరఖాస్తుదారులు ఒక్కో దరఖాస్తుకు రూ.35 చెల్లించాలని తెలిపారు.

లోక్ అదాలత్‌లో 1121 కేసులు పరిష్కారం



కోర్టులో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్



నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో లోక్ అదాలత్

గూడూరు: రాజీ మార్గమే రాజమార్గమని, చిన్న చిన్న విషయాలకు కోర్టులకెక్కి విలువైన సమయం , సొమ్మును వృధా చేసుకోరాదని7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్విన్ సుల్తానా బేగం అన్నారు. స్థానిక 2వ పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్, న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు.జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ తదితర 1121 కేసులకు గాను 1,25,42,150 రూపాయలు కక్షిదారులకు అందజేసినట్లు చెప్పారు. అనంతరం నిర్వహించిన సదస్సులో ఆమె పైవిధంగా హితవు పలికారు. సీనియర్ సివిల్ జడ్జి మురళీధర్ మాట్లాడారు. న్యాయవాదులు వెంగల్‌రెడ్డి, కోటేశ్వరరావు, సురేష్, యూసఫ్ హుస్సేన్, సీఐలు హజరత్‌బాబు, దశరథరామారావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నాయుడుపేటలో 2497 కేసులు..

నాయుడుపేట: నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 2,497 కేసులను పరిష్కరించినట్లు న్యాయమూర్తులు వెల్లడించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భరద్వాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయుడుపేటకు సంబంధించి 820 కేసులు పరిష్కరించి కక్షిదారులకు రూ.7.60 లక్షల పరిహారం, అలాగే సూళ్లూరుపేట సివిల్ కోర్టుకు సంబంధించి 851 కేసులు పరిష్కరించి రూ.3.83, 296 పరిహారం, వెంకటగిరి సివిల్ కోర్టుకు సంబంధించి 826 కేసులు పరిష్కరించి రూ.7.49,813 పరిహారం కక్షిదారులకు అందజేసినట్లు వివరించారు. నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు జీవీఎల్‌కే కిషోర్, సీనియర్ న్యాయవాదులు మూడు కోర్టుల న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు

వ్యవసాయ పనిముట్లు పంపిణీ



ట్రాక్టర్‌ను అందజేస్తున్న ఎంపీపీ అనిల్ కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట : కస్టమ్ హైరింగ్ సెంటర్‌లోని గ్రూపు సభ్యులకు 40 శాతం రాయితీతో రైతుసేవా సహకారం సంఘం కార్యాలయం వద్ద ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం రైతులకు అందజేశారు. వీటిలో ట్రాక్టర్, రోటావేటర్లు, ట్రాక్టర్ పరికరాలు, స్ప్రేయర్లు మొదలైనవి ఉన్నాయి. వీటి విలువ రూ.30 లక్షలు కాగా ఇందులో రూ.15 లక్షలు బ్యాంకు రుణం, రూ.11 లక్షలు సబ్సిడీ వర్తించిందని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి కమిటీ చైర్మన్ మందా దేవేంద్రరెడ్డి, కడపత్ర ఎంపీటీసీ అరుణమ్మ, సర్పంచ్‌లు చిన్నరాజా, బుంగా చెంగయ్య, నాయకులు వేణుయాదవ్, మీజూరు రామకృష్ణారెడ్డి, ఏఓ కవిత పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించండి



ఫుట్‌బాల్ క్రీడాకారులతో రాష్ట్ర మాజీ కోచ్ రాజు, నిర్వాహకులు, సీనియర్ క్రీడాకారులు

నాయుడుపేటటౌన్: క్రీడాకారులకు తరచూ క్రీడాపోటీలను నిర్వహించి ప్రోత్సహించాలని ఉమ్మడి ఏపీ పోలీస్ ఫుట్‌బాల్ రాష్ట్ర మాజీ కోచ్ ఎస్ఐ కే.రాజు అన్నారు. నాయుడుపేటలో జరుగుతున్న సౌత్ ఇండియా స్థాయి ఫుట్‌బాల్ పోటీలను శనివారం సాయంత్రం ఆయన తిలకించారు. కార్యక్రమంలో గుమ్మిడిపూండి రైల్వే ఎస్ఐ, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు మైనుద్దీన్, సీనియర్ క్రీడాకారులు రాజన్‌బాబు, కోచ్ గౌస్, భవాన్ అనుదీప్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పోటీల ఫలితాలు

తిరుపతిపై చెన్నై సిటీ పోలీస్, నెల్లూరు జట్టుపై చెన్నై మీంజూర్ క్లబ్, హుబ్లీ జట్టుపై ఫలక్‌నామా హైదరాబాద్, సికింద్రాబాద్ జట్టుపై విశాఖపట్నం గెలిచాయి. ఆదివారం ఉదయం సెమీఫైనల్స్, సాయంత్రం ఫైనల్స్ జరుగుతాయని నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు చెప్పారు.

క్లుప్తంగా

బల్లవోలు డ్రైన్ ఆధునీకరణకు వినతి



సీఎంను కలిసి సమస్యలు తెలియజేస్తున్న క్రిష్టారెడ్డి

చిల్లకూరు: వర్షా కాలంలో నీరు నిలిచి పోయి బల్లవోలు డ్రైన్ పొంగుతూండడంతో వేలాది ఎకరాలలో పంటల సాగుకు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని ఆధునీకరించాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డికి బల్లవోలుకు చెందిన సీనియర్ నాయకులు దువ్వూరు క్రిష్టారెడ్డి వినతి పత్రం ఇచ్చారు. సీఎంకు శుక్రవారం కావలిలో ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తితో కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు శనివారం ఆయన తెలిపారు. తీర ప్రాంతంలో అధికంగా సిలికా తవ్వకాలు చేస్తుండడంతో వేరుశనగ రైతులు పడుతున్న ఇబ్బందులను తెలియజేశామని, కోస్టల్ కారిడార్‌కు కేటాయించిన భూ సేకరణకు సంబంధించి పరిహారం త్వరగా ఇచ్చేలా చేయాలని కోరామని, దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వరరావు

వెంకటగిరి: పట్టణంలోని 9వ వార్డు కౌన్సిలర్ కందాటి కళ్యాణి ఆధ్వర్యంలో చేపట్టిన మన వార్డు-మన పరిశుభ్రత కార్యక్రమం ఆ వార్డు పరిధిలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకేనని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తెలిపారు. దీన్ని శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చెత్తను రోడ్లుపై వేయకుండా కార్మికులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు ఎంఏ నారాయణ, ప్రభావతి, ఎన్ శేఖర్, ఎం జానకిరామయ్య, నాయకులు చింతపట్ల మురళి, నందకుమార్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి బైబిల్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న బైబిల్ స్కూల్ పిల్లలు

గూడూరు రూరల్: స్థానిక రాణిపేటలోని బేతాని ప్రార్థనా మందిరంలోని చిన్నారులు శనివారం గూడూరులో ర్యాలీ నిర్వహించారు. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు బైబిల్‌లోని ప్రధాన అంశాలపై చర్చి పెద్దలు, సంఘ కాపరి వేసవి బైబిల్ స్కూల్ నిర్వహిస్తున్నారు సంఘ కాపరి విక్టర్ పాల్ మాట్లాడుతూ, బ్రదర్ పరంజ్యోతి(చెన్నై) ఇక్కడి చిన్నారులకు బైబిల్‌పై శిక్షణ, వాక్య పరిచర్య ఉంటుందన్నారు. మార్కెట్ సెంటర్ మీదుగా టవర్ క్లాక్, రాణిపేటలోని చర్చి వరకు ర్యాలీ చేశారు.

పర్యావరణంపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ అధికారులు

రాపూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని పర్యావరణ హిత జీవన శైలిపై అటవీశాఖ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ఏపూరు సెక్షన్ ఆఫీసర్ రసూల్ మాట్లాడుతూ, ప్రజలు నీరు, ఇంధనం , ఆహారం, విద్యుత్ మొదలైన వాటిని వృధా చేయరాదన్నారు. స్థానిక పెట్రోల్ బంక్ వద్ద వాహనదారులకు ఇంధనం, ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు పాటు పడతామని ప్రతిజ్ఞ చేశారు.

భక్తిశ్రద్ధలతో కలశమాల శోభాయాత్ర

నాయుడుపేటటౌన్: స్వర్ణముఖినది నుంచి పట్టణంలోని అగ్రహారపేటలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వరకు మంగళవారం స్వామివారి కలశమాల శోభా యాత్రను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హనుమ జయంతి సందర్భంగా స్వర్ణముఖి నది వద్ద ప్రత్యేక పూజలు చేపట్టి కలశాలలో జలాలు తీసుకుని శ్రీరామ సంకీర్తనలతో మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు.

భక్తులతో కిక్కిరిసిన పెంచలకోన

రాపూరు: మండలంలోని పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మొదటి శనివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.